క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి దాతల సహకారం



రూ.25వేల విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాకలోని శ్రీ వేంకటేశ్వర రామాలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా మునగపాకకు చెందిన వెలగా వెంకటప్పారావు కుమారులు రాజు, శివ రూ.25వేల మేర విరాళం అందజేశారు. అలయ నిర్వాహకులు వెలగా శ్రీనివాసరావుకు సంబంధిత విరాళాన్ని అందించారు.

దళిత రైతుల విజ్ఞాన యాత్ర



కేవీకేలో శిక్షణలో దళిత రైతులు

రాంబిల్లి : పలు మండలాలకు చెందిన దళిత రైతులను హరిపురం బీసీటీ కేవీకే యాజమాన్యం తమిళనాడులో కేవీకేలకు విజ్ఞాన యాత్రకు తీసుకువెళ్లింది. తమిళనాడులో నమ్మకలు, సలాం కేవీకేల్లో ఐదు రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు తీసుకు వెళ్లినట్టు భూసార శాస్త్రవేత్త బుర్ల శ్రీహరిరావు తెలిపారు. పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల సంరక్షణతో పాటు పంటల యాజమాన్యం అక్కడి శాస్త్రవేత్తలు శిక్షణ ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ రైతుల బృందంలో శ్రీహరితో పాటు బీసీటీ కేవీకే పశువైద్యురాలు విజైరాగ్ని ఉన్నారు.

ఘనంగా నల్లమారమ్మ తల్లి పండగ



నల్లమారమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మండలంలోని పాటిపల్లి పంచాయతీ నల్లమారమ్మ తల్లి అమ్మవారి పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారికి గుర్తింపు ఉండడంతో పలు ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

రాంబిల్లి సీఐగా లక్ష్మణరావు



బాధ్యతలు స్వీకరించిన సీఐ లక్ష్మణరావు

రాంబిల్లి : కొత్తగా ఏర్పాటైన రాంబిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఎస్.లక్ష్మణరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాంబిల్లి పోలీస్‌స్టేషన్ యలమంచిలి సర్కిల్‌లో ఉండేది. అయితే నేవల్‌బేస్, సెజ్ నాన్ సెజ్‌లో పలు పరిశ్రమలు రాంబిల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నాయి. దీంతో ప్రభుత్వం రాంబిల్లి సర్కిల్‌ను ఏర్పాటు చేసింది. శ్రీకాకుళం జిల్లా పొందూరు ఎస్ఐగా పనిచేసిన లక్ష్మణరావు పదోన్నతిపై సీఐగా రాంబిల్లి వచ్చారు. సర్కిల్ తొలి సీఐగా రావడం ఆనందం వుందని, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఘనంగా శ్రీరాముల తీర్థం



చిట్టిబోయిన పాలెంలో తీర్థ సందడి

అచ్యుతాపురం : మండలంలోని చిట్టిబోయిన పాలెంలో ఆదివారం రాత్రి శ్రీరాముల వారి తీర్థం ఘనంగా జరిగింది. గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా చిటికలు, భజనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి.

వైవిధ్యం హైస్కూల్ ప్లస్

- బాలికా విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం
- జూనియర్ కాలేజీగా యలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల అప్‌గ్రేడ్
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో హైస్కూళ్లలో ప్రత్యేకంగా బాలికలకు ఇంటర్ విద్య
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు, తల్లిదండ్రులు



యలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల తరగతిలో ఇంటర్ విద్యార్థినులు

యలమంచిలి రూరల్ : హైస్కూల్ ప్లస్ విధానంలో బాలికలకు ఉన్న ఊళ్లల్లోనే ఇంటర్‌మీడియట్ విద్యను అందించాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఆశయం . ఇందులో భాగంగా 2022–23 విద్యా సంవత్సరంలో యలమంచిలి పట్టణంలోని తులసీనగర్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ పాఠశాలలో ఇంటర్ విద్యకు అవసరమైన మౌలిక సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. గతేడాది ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాలను ఇక్కడ ప్రారంభించారు. మొత్తం 40 సీట్లను బాలికలకు మాత్రమే కేటాయించారు.అధ్యాపకుల కొరత లేకుండా అన్ని సబ్జెక్టుల బోధనకు అధ్యాపకులను సైతం ప్రభుత్వం నియమించింది.ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందజేసింది. ప్రస్తుతం ఇక్కడ మొదటి సంవత్సరంలో 37మంది, ద్వితీయ సంవత్సరంలో 13 మంది బాలికలు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. గత టీడీపీ పాలనలో బాలికల చదువు అత్యంత దయనీయంగా ఉండేది.నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల మాత్రమే ఉండేది. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండే కుటుంబాల్లో ఆడపిల్లలకు చదువెందుకనే ధోరణి,తమ గ్రామానికి కళాశాలలు దూరంగా ఉండడం, ఇలా అనేక కారణాల వల్ల ఆడ పిల్లలకు పదో తరగతితో చదువు ఆగిపోయేది. గ్రామీణ ప్రాంతాల్లో కొంత మంది తల్లిదండ్రులు తమ ఆడపిల్లల్ని చదువు మానిపించి టైలరింగ్, కూలిపనులకు పంపించి వరుడు దొరికితే వివాహాలు చేసేవారు. దీంతో పదో తరగతి చదువుకున్నా ఆ అమ్మాయికి ఎటువంటి ఉపయోగం ఉండేది కాదు. ఉన్న ఊళ్లోనే ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకువస్తే ఈ పరిస్థితి మారుతుందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భావించారు.పదో తరగతి పూర్తయిన వెంటనే అదే పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం వరకు చదువుకునే వెసులుబాటు కల్పించారు.దీంతో తల్లిదండ్రుల ఆలోచనా ధోరణిలో కూడా మార్పు వచ్చింది. గ్రామంలోనే కళాశాల ఉండడంతో తమ కుమార్తెలను మరో రెండేళ్ల పాటు ఇంటర్ చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.



హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ అయిన యలమంచిలి జెడ్పీ బాలికోన్నత పాఠశాల

ఫ్యాకల్టీ చాలా బాగుంది



నేను రాజమండ్రి సమీపంలోని గోకవరంలో 10వ తరగతి వరకు చదువుకున్నాను. యలమంచిలి బాలికోన్నత పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరాను. ఇక్కడ సమీపంలోని కళాశాల వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నాను. మా తరగతిలో 37 మంది విద్యార్థినులు ఉన్నాం. అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించారు. అధ్యాపకులంతా పాఠాలు బాగా చెబుతున్నారు. ఇంటర్ అందుబాటులో ఉండడంతో దూరంగా ఉండే కళాశాలలకు వెళాల్సిన ప్రయాస తప్పింది. రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.

–చుక్కా శ్రావ్య సత్య దుర్గ, బైపీసీ మొదటి సంవత్సరం

ఇంజనీర్ అవుతా



మాది పేద కుటుంబం. మా నాన్న భవన నిర్మాణ పనులు చేస్తారు. 10వ తరగతి ఇపుడు మా కాలనీలోనే ఇంటర్ కోర్సు అందుబాటులోకి రావడం, అమ్మఒడి కూడా ఇస్తుండడంతో ఇపుడు మా తల్లిదండ్రులు ఇంజినీరింగ్ కూడా చదివిస్తామంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాకు దగ్గర్లోనే బాలికలకు ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ ఏర్పాటు చేయడంతో మేము కూడా మగపిల్లలతో సమానంగా ఉన్నత విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవడానికి ఆస్కారం ఏర్పడింది. బాలికలకు ఇంటర్ విద్యను అందుబాటులోకి తేవాలన్న నిర్ణయాన్ని తక్షణమే అమలు చేయడం మాకెంతో మేలు చేసింది. –యల్లపు మేఘన, ఎంపీసీ సెకండియర్

బాలికలకు ఉపయోగం



ప్లస్ టూ విధానం అమలులోకి రావడం బాలికలకు ఎంతో ఉపయోగం. ప్రభుత్వం అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించింది. ప్రస్తుతం 50 మంది విద్యార్థులు చదువుతున్నారు. పరిమిత సంఖ్యలోనే విద్యార్థులు ఉండడం వల్ల వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ప్రభుత్వం ఈ విధానం నెలకొల్పి రెండేళ్లే అవుతోంది. భవిష్యత్తులో దీని ఫలాలు మరింత మెరుగ్గా ఉంటాయనడంలో సందేహం లేదు. మంచి ఉత్తీర్ణత సాధించడానికి చర్యలు తీసుకున్నాం.

–వి.వి.హిమబిందు, హెచ్ఎం

నిరుపేదలకు వరం



హైస్కూల్లోనే ఇంటర్మీడియట్ కోర్సు నెలకొల్పడం నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులకు వరం. ప్రభుత్వం విద్యలో ఇలాంటి విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడం బాలికలకు మేలు చేస్తుంది. తరగతికి 40 మంది విద్యార్థులే కావడం వల్ల ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టడానికి వీలు కలుగుతోంది. గతేడాది తరగతులు ఆలస్యంగా ప్రారంభం కావడం వల్ల 13 మంది మాత్రమే ప్రవేశాలు తీసుకున్నారు. ఈసారి అధ్యాపకులంతా ఎంతో కష్టపడి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయడంతో ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి.

–ముప్పల రాంబాబు, తెలుగు అధ్యాపకుడు

భీమిలి సభతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మరింత జోష్



భీమిలి సిద్ధం సభలో కేరింతలు కొడుతున్న ఎస్.రాయవరం మండల యువత

ఎస్.రాయవరం : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భీమిలి వేదికగా శనివారం నిర్వహించిన సిద్ధం సభతో మనసు పులకరించిపోయిందని మండల వాసులు చెబుతున్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజలకు మంచి చేసిన సంగతి నేరుగా వెళ్లి చెప్పాలన్న సీఎం ఆదేశం తమకు గుర్తింపుగా అనిపించిందని వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా ఆనందం వ్యక్తం చేశారు. తామంతా సిద్ధం సమావేశానికి వెళ్లి జగన్ మోహన్‌రెడ్డిని మరలా సీఎం చేయడానికి సిద్ధం అయిపోతున్నామని చెప్పామన్నారు. సభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుమారు గంటన్నర చేసిన ప్రసంగం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. ప్రభుత్వ పథకాలు నిజమైన అర్హులకు పార్టీలకతీతంగా అందించామనే విషయం ప్రతిపక్షాలు వారు నోరెత్తకుండా చెప్పాలన్నారు. ఈ సభతో కార్యకర్తల్లో ఉన్న చోటామోటా నిరుత్సాహాన్ని నులిమేసిందని, యువతలో మరింత జోష్ నింపిందని సోమిదేవపల్లికి చెందిన పోచిన నరేష్ తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాకే బీసీ నాయకులకు గుర్తింపు లభించిందని, బీసీల్లో అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పదవులు కేటాయించారని, తమ వర్గాలన్నీ జగన్ వెంటే నడుస్తామని పెట్టుగోళ్లపల్లికి చెందిన చొప్పారాజు ఆనందం వ్యక్తం చేశారు. భీమిలి సభ పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యిందని, జనసందోహంతో గ్యాలరీలన్నీ నిండిపోయాయని పెద గుమ్ములూరుకు చెందిన వెలగా శ్రీనివాసరావు అన్నారు. ఎన్ని పార్టీలు వచ్చినా జగన్ రూట్‌ని మార్చలేరు..మరళా విజయం మాదేనని విశ్వాసం వ్యక్తం చేశారు.

వెలగా కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక



కొండకర్ల ఆవలో వెలగా కుటుంబ సభ్యుల కలయిక

అచ్యుతాపురం: మండలంలోని కొండకర్ల ఆవ ప్రాంతంలో మునగపాకకు చెందిన వెలగా కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఉదయం నుంచి సంబంధిత కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆట పాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. 320 మంది వరకు పిల్లలు,పెద్దలు ఆత్మీయ కలయికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు.పెద్దలకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘంలోని పెద్దలను శాలువాలతో సత్కరించారు. ఇటీవల వైద్య సీట్లు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సత్కరించారు. అందరూ సహపంక్తి భోజనాలు చేసి సందడి చేశారు. సమీపంలోని ఆవలో బోటు షికారు చేశారు. వెలగా సంఘ అధ్యక్షుడు బొడ్డేడ అప్పలనాయుడుతో పాటు కార్యవర్గ సభ్యులు, కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

ఎన్ని పార్టీలు ఏకమైనా వైఎస్సార్‌సీపీదే విజయం



చిక్కాల రామారావు జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు

పాయకరావుపేట : రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఏకమైనా సరే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయమని, మళ్లీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహిస్తారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో గల జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు జన్మదిన కార్యక్రమానికి ఆదివారం ఆయన పెంటకోట గ్రామం విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో మంచి మెజార్టీతో నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగుల్ని గెలిపించాలన్నారు. వైఎస్సార్‌సీపీకి అన్ని విధాలుగా అండగా వున్న స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు పార్టీ సముచిత స్థానం కల్పించి రాజ్యసభకు పంపిస్తున్నారన్నారు. ఇక్కడ పార్టీని విజయపథంలో నడిపిస్తున్న చిక్కాల రామారావుకు మరింత ఉన్నత పదవులు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కూడా మనందరం సైనికుల్లా పనిచేసి మరలా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. చిక్కాల రామారావు జన్మదినం సందర్భంగా పట్టణంలో పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా ఆధ్వర్యంలో ఆయన కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. సీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. సత్యవరం గ్రామంలో పాలపర్తి సతీష్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చిక్కాల రామారావుకు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమ గణేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ జన్మదిన వేడుకల్లో సప్తగిరి యాచరీస్ అధినేత పెదబాబు, ప్రముఖ బంగారం వ్యాపారి దాడిశెట్టి విష్ణుచక్రం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఇన్‌చార్జ్ ఎం.భరత్, గ్రేటర్ విశాఖ డిప్యూటీ మేయర్ కె.సతీష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు సుజాత, జెడ్పీటీసీ సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పాయకరావుపేట, నామవరం పీఏసీఎస్ అధ్యక్షులు రాజేష్ ఖన్నా, కె.సుందరీలత, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైలా రమేష్, డాక్టర్ బంగారయ్య, విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గణేష్, పాయకరావుపేట, నక్కపల్లి మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అతిథులందరూ చిక్కాల జన్మదిన కేక్‌ను కట్ చేసి, గజమాలలతో సత్కరించారు. చిక్కాల రామారావు మాట్లాడుతూ తన పుట్టినరోజు కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి, ఎమ్మెల్యేలతో పాటు పార్టీశ్రేణులకు,అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రాంబిల్లి: పంచదార్లలో ఆదివారం పేకాట శిబిరంపై రాంబిల్లి పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ ఎస్. లక్ష్మణరావు ఆధ్వర్యంలో సిబ్బంది పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ 11,900 స్వాధీనం చేసుకున్నారు. మండలంలో పేకాటలు, కోడిపందాలు నిర్వహిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. పేకాటలు, కోడిపందాలు , గుళ్లాటలు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ఘనంగా మరిడిమాంబ తీర్థం

యలమంచిలి : జంపపాలెం గ్రామంలో ఆదివారం గ్రామ దేవత మరిడిమాంబ తీర్థం ఘనంగా జరిగింది. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అమ్మవారి ఆలయం వద్ద తీర్థం ఉత్సవ కమిటీ నిర్వహించింది. అమ్మవారి ఆలయం వద్ద మహిళలు కోలాటాలు భజనలు సాముగరిడీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో పలువురు భక్తులు మొక్కులు చెల్లించుకుని అమ్మ దయను పొందారు. అమ్మవారి ఆలయానికి విద్యుద్దీపాలంకరణ చేసి, బాణాసంచా కాల్చారు.

అక్రమ గ్రావెల్ రవాణా పట్టివేత



రెవెన్యూ అధికారుల దాడుల్లో పట్టుబడిన గ్రావెల్ లోడు ట్రాక్టర్లు

ఎస్.రాయవరం : మండలంలో అక్రమ గ్రావెల్ ఇసుక రవాణాకు కళ్లెం వేసేందుకు చర్యలు చేపట్టినట్టు డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్ తెలిపారు. రాత్రి పగలు తేడా లేకుండా కొత్తపోలవరం కొండపై గ్రావెల్ తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో రెవెన్యూ సిబ్బంది దాడులు చేసి రెండు ట్రాక్టర్లు పట్టుకుని సీజ్ చేసినట్టు తెలిపారు. అనుమతులు లేకుండా గ్రావెల్, ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టుబడిన ట్రాక్టర్లను మైన్స్ అధికారులకు అప్పగించి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

‘చదవడం అంటే మాకిష్టం’

అచ్యుతాపురం : అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం అంటే మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు గణితం, భాష, కథలు వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగులాపల్లిలో ఉచిత వైద్య శిబిరం



నాగులాపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. హైస్కూల్లో ఏర్పాటు చేసిన శిబిరానికి 187మంది రోగులు హాజరయ్యారు. మాజీ సర్పంచ్ మళ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన శిబిరానికి వైద్యులు హరి ప్రసాద్, రాజుబాబు, మోహనరావు, పోలినాయుడు, తనూజ తదితరులు సేవలందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు మాట్లాడుతూ నాగులాపల్లి గ్రామాభివృద్ధికి అప్పలనాయుడు అందించిన సేవలు మరువలేనివన్నారు. దొడ్డి శ్రీనివాసరావు, పెతకంశెట్టి రాజునాయుడు, యల్లపు వెంకటప్పారావు, మద్దాల కృష్ణ,దొడ్డి శివ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

- రూ.2.50 లక్షల ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

యలమంచిలి : వరిగడ్డిని తరలిస్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి ట్రాక్టర్ దగ్ధమైన ఘటన ఆదివారం యలమంచిలి పట్టణం, రామ్‌నగర్ వద్ద చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన అగ్నిమాపకశాఖ అధికారి డి.రాంబాబు తెలిపిన వివరాలివి. రాంబిల్లి మండలం దిమిలి గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని తుమ్మపాల రామారావు వరి గడ్డిని అమ్మకం నిమిత్తం యలమంచిలి పట్టణం, శేషుగెడ్డ కాలనీ, రామ్‌నగర్ తరలిస్తుండగా రామ్‌నగర్ సమీపంలో విద్యుత్ లైను సర్వీస్ వైరు గడ్డికి తగిలి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ట్రాక్టర్‌లో ఉన్న గడ్డి, ట్రాక్టర్ తొట్టి కాలిపోయాయి. దీనిని గమనించి స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై ట్రాక్టర్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమారు రూ.2.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, రూ.3 లక్షలు విలువ చేసే ట్రాక్టర్ సామాగ్రిని రక్షించడం జరిగిందని తెలిపారు.

జగన్ సభతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు

- భీమిలి సభను విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు
- పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే జోగులు



నక్కపల్లి : ఎన్నికల శంఖారావం పేరుతో శనివారం భీమిలో జరిగిన వైఎస్సార్‌సీపీ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి తరలి వచ్చి విజయవంతం చేసిన నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు చెప్పారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ సభ వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మంచి జోష్ నింపిందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ సభలో చేసిన దిశానిర్దేశం పార్టీ కార్యకర్తలకు నాయకులకు ఆత్మస్థయిర్యాన్ని ఇవ్వడంతో పాటు వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుని సంక్షేమ పథకాలు కొనసాగించుకోవాలనే పట్టుదల పెరిగిందన్నారు. కేవలం ఉత్తరాంధ్రలో ఐదు జిల్లాలకు చెందిన వారితో నిర్వహించిన ఈ బహిరంగ సభకు లక్షలాది మంది స్వచ్ఛందంగా తరలిరావడం పార్టీ మీద ఉన్న అభిమానాన్ని, ముఖ్యమంత్రి జగనన్న మీద ఉన్న నమ్మకాన్ని మరోసారి రుజువు చేసిందన్నారు. బహిరంగ సభలో జగనన్న చేసిన ప్రసంగానికి కార్యకర్తల్లో మంచి హుషారు రాగా ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. ఎల్లో మీడియా, ప్రతిపక్ష పార్టీలు ఎంత కుట్రచేసినా, ఎంత తప్పుడు ప్రచారం చేసినా సరే జగనన్నే మా నమ్మకం , మా భరోసా రాష్ట్రానికి దిక్సూచి అన్న విధంగా బహిరంగ సభకు జనం తరలి వచ్చి విజయవంతం చేశారన్నారు. కేవలం ఒక ప్రాంతానికి పరిమితమయిన ఈ సభకు రాష్ట్ర చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో లక్షలాది మంది తరలి రావడం ఆనందంగా ఉందన్నారు. జగనన్న పిలుపుతో త్వరలో అన్ని గ్రామాల్లో పర్యటించి ఎన్నికలకు కేడర్‌ను సమాయత్తం చేస్తామన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే సత్తా, ధైర్యం, హక్కు వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

బ్రాండిక్స్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి బాధితులకు కళ్లద్దాలు పెడుతున్న బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి

అచ్యుతాపురం : బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 350 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 223 మందికి ఉచిత కళ్లద్దాలు అందజేశారు. 58 మందికి ఉచితంగా మందులు అందజేశారు. 35 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు. కంటి బాధితులతో బ్రాండెక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మమేకం అయ్యారు.